


# హెచ్చరిక

ఆకలి కేకలను అణిచే క్రమంలో బీడీ కార్మికురాలైన భారతి గుండెలనిండా బాధ. భర్త నారాయణ పిడిగుద్దులతో వీపు విమానం మోతమోగింది. ఒళ్లంతా నొప్పులు. రోజుట్లాగే సూర్యోదయంతో పోటీపడుతూ నిద్ర లేచింది. కత్తిరించిన అకును అనగ బెట్టింది. పొగాకు పొడి చేటలో పోసుకుంది. ఆరేళ్ల కూతురు అరవింద నిద్రలేచేదాకా బీడీలు చుట్టింది. అరవింద లేవగానే తయారు చేసి బడికి పంపించింది. తాను వేడిచాయ జుర్రుకుంటూ గోడకొరిగికూచుంది. బీడీలు చుడుతూ చాయ్ సేవిస్తూంటే ఉత్సాహం ఉరకలేసింది. నారాయణ బుద్ధిగా ఉద్యోగం చేసుకొంటే తనకా అవస్థ తప్పేది. ఉద్యోగానికి ఎగనామం పెట్టి తెగిన  గాలిపటంలా తిరుగుతున్నాడు. పొద్దంతా తాగుడుతూనే గడిపేస్తున్నాడు.

ఆ రోజుల్లో బుద్ధిగా ఉద్యోగానికెళ్లేవాడు. సాయంత్రం పూలదండ తెచ్చి తలలో తురిమేవాడు. నెలజీతం తన చేతికిచ్చి జేబుఖర్చులకు చెయ్యి చాచేవాడు. సంవత్సరం క్రితం.... ఎదురింట్లో అద్దె కుదుర్చుకుని దిగిన వెంకటేశం సహవాసమే తాగుడు కలవాటు చేసింది. ఇద్దరూ కలిసి తాగేవారు, తిరిగేవారు. ఇది మంచిది కాదని మందలించలేదు. వెంకటేశం లివర్ క్యాన్సర్తో చనిపోయినా నారాయణ తాగుడు మానలేదు. తనను బెదిరించి, దెబ్బలు కొట్టి డబ్బులు లాక్కెళ్లి ఫుల్‌గా తాగొస్తున్నాడు. ఉద్యోగాని కెళ్లడం పూర్తిగా మానేసిండు. "వెంకటేశం తాగి సచ్చిండు. అ పిచ్చి తాగుడు బంద్ చేసి ఉద్యోగానికెళ్ళు. మన అరవింద స్కూలు ఫీజు కట్టాలె. ఇల్లు గడవాలె. గిట్లైతే ఎట్లా"? అని ఎన్నోసార్లు అడిగింది. ఈ జన్మలో ఇక తాగనని ఒట్టేసుకుంటాడు. తెల్లవారితే కుక్కతోక వంకర అన్నట్టు అదే పక్రబుద్ధి. అతడు పంచేస్తున్న షాపు యజమాని ఇంటిదాకా వచ్చి ఉద్యోగ మాటిపోతుందని వార్నింగిచ్చిపోయిండు.... గాలికి ఊగుతున్న మక్క కర్రలా వచ్చిండు నారాయణ. ముందు కూర్చున్నాడు... నోటి దుర్వాసన... తన ఒడిలోంచి బీడీల చేట తీసి పక్కన బెట్టింది. "ఓ యాభై రూపాయలివ్వు భారతి"!

పీకల దాకా కోపమొచ్చింది. "యాభైపైసలు కూడా లేవు". "నీ యవ్వ అరవింద పోరి ఫీజుకు, రేషన్ సరకులకు పైసలిస్తావుగాని నా కియ్యమంటే లేవంటవు... నీ యవ్వ... బూతు పురాణం విప్పిండు. అప్పటికే తాగొచ్చినా బుద్ధిదీరలేదెమో!. సిగ్గులేదూ!" తన రోషం కళ్లలోకిచ్చింది. "పెండ్లాం సంపాదనతోని తాగి తందనానలాడే మొగుడు... మొగాడేనా? థూ.....". జడబట్టి లాగి లెంపలు వాయించాడు.... ప్రతిఘటిస్తూ లేని నుంచుంది. వీపు మీద పిడిగుద్దుల వర్షం కురిపించిండు. "తెలివితక్కువ దద్దమ్మా. పెండ్లాంపిల్లల్ని సాదె తెలివిలేదు...." తాను తిట్ల పురాణం విప్పింది. గుద్దుల వర్షం రెట్టింపైంది.

"వామ్మో... వాయ్యో.... ఎల్లక్కో రామక్కో... రాండ్రే...! కేకలేసింది. చుట్టుపక్కల ఇళ్ల వాళ్లంతా వచ్చి గుమిగుడారు. "ఇది ఆలు మొగల పంచాయితీ" అనుకుంటూ మగ మహారాజులు వెళ్లిపోయారు. ఆడవాళ్లు విడిపించారు. బండబూతులు తిడుతూ నారాయణ బజారు బాట పట్టిండు. భారతి వెక్కివెక్కి ఏడుస్తోంది. అప్పుడే తల్లి రాధమ్మ వచ్చింది. తమే డ్వాక్రాగ్రూపుల సమాఖ్య నాయకురాలు. ధైర్యమే ఊపిరిగా.... భర్త చనిపోయినా లెక్కల కష్టంమీద భారతిని పెంచి పెళ్లిచేసింది. రెక్కల కష్టాన్ని నమ్ముకుంది. కూతురుని చూస్తుంటే గుండె చెరువై పోయింది. "ఏమైంది బిడ్డా?" కూతురును ఒడిలోకి తీసుకుంది. కొంగుతో కళ్లు అద్ది కూతురు చెప్పినదంతా విన్నది. "వామ్మో... అల్లుడు గట్ల తయారయిండా?" గుండెలు బాదుకుంది. అక్కడున్న ఆడవాళ్లంతా రాధమ్మ గ్రూపులలోని వారే. వారు కూడా అంతా చెప్పారు.

"ఇన్ని రోజులు నాకెందుకు చెప్పలేదు బిడ్డా?" కూతురును మందలించింది. "ఈ రోజుల్లో ఆడది అన్ని రంగాల్లో మొగాళ్ళతోని పోటీ పడుతుంది. మిస్త్రీల గూడ పనిచేస్తున్నారు ఆడోళ్లు. నువ్వేమీ భయపడకు బిడ్డా" కూతురు తల నిమురుతూ ధైర్యం చెప్పింది. రాధమ్మ బుర్రలో భూగోళం బద్దలైంది. మొహమ్మీద ముంగురుల్ని రోషంగా సవరించుకుంది. ఎదురింటి ఆడవాళ్లందరినీ పలుకరించి "మన ఆడవాళ్లంటే ఏందో చూపిద్దామా....!" అడిగింది. సరేనన్నారంతా. ఎటుబొయ్యి ఎటొస్తుందోననే భయంతో భారతి భయపడింది. "ఆయననే దారికొస్తాడమ్మా. ఆయననేం చెయ్యొద్దు" అంది తల్లితో. "తాగుడు కలవాటుపడి దానికి బానిసై పోయినాడు. తల్లి చెప్పినా వినడు" అన్నారంతా. భారతి మౌనం వహించింది. ఆడవాళ్లందరి చెవుల్లో గుసగుసలు చెప్పింది తల్లి. ఆయనొచ్చే టైమైంది నువుపో అమ్మా!" వణికి పోయింది భారతి. "ఊరుకోవే పిరికిదానా!" కూతుర్ని గద్దించింది. ఆడవాళ్ళకు సైగ చేసింది. మళ్లీ వస్తా... మంటూ అంతా వెళ్లిపోయారు. అప్పుడే

ప్రత్యక్షమయ్యాడు నారాయణ. భార్య ముందున్నాడు. "ఏయ్ భారతి ముండా! పైసలిస్తవా లేదా?" ఉరిమిండు. "నువు ఛస్తేగదా అది ముండ అయ్యేది" ఇద్దరి మధ్య కొచ్చి నుంచుంది రాధమ్మ. "ఉద్యోగం బంద్ చేసి తాగుతుంటే ఎట్లా బతుకుత రనుకున్నావ్" నీలదీసింది అల్లుడ్ని.

"ఓ అత్తా! నీ బిడ్డకు మొగుడంటే మొద్దుతో సమానమైంది. జెర బుద్ధిజెప్పుమంటే నన్ను గట్లంటవేంది? గా గాంధీమహాత్ముని నీతులు బంద్‌చేసి నాకు పైసలియ్యమని నీ బిడ్డకు సముదాయించు". "మంచి మాటలు చేప్తే వినవా? తాగుడు బంద్ జెయ్యవా అల్లుడా?" కొంగు నడుముకు బిగించింది. "ఉద్యోగానికి పోవా"?. "నీ యవ్వ....." నారాయణకు కోపం నశాళానికంటింది. "మా అలుమొగల మధ్య నువ్వేవలు పో...." చెయ్యి పైకిలెచింది. రాధమ్మ చీపురుకట్ట అందుకుంది. చీపుర్లు, కర్రలతో ఆడవాళ్లంతా వచ్చారప్పుడే. రాధమ్మ సైగ జేసింది. నారాయణ ఒంటిమీద చీపుర్లు, కర్రలు నాట్యమాడుతుంటే లబోదిబో మంటున్నాడు.

"ఆడదంటే గాడిదనుకున్నావురా?". "పెండ్లామంటే పశువనుకున్నావురా?". తిట్లతో పాటు కొట్లు ఊపందుకున్నాయి. "వామ్మో.... వాయ్యో.... ఇగ తాగనత్తా...." అంగలారుస్తూ కూలబడ్డాడు. అందరికీ చేతులు జోడించాడు. రాధమ్మ సైగతో కొట్ల వర్షం ఆగింది? "ఇప్పుడు జెప్పు ఉద్యోగానికి పోతావాలేదా?" ఉరిమింది రాధమ్మ. నారాయణ పౌరుషమంతా నీరుగారి పోయింది. "తప్పయింది. ఉద్యోగానికి పోతా.... భారతిని కొట్టను.... తాగుడు ఇప్పట్నుంచే బంద్". రాధమ్మ కాళ్లు మొక్కాడు. భారతి మొహం బంతిపూవులా విచ్చుకుంది.

*(సూర్య, 12-6-2011)*